


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### గమనిక

**పొద్దుటే ఫేస్‌బుక్** తీస్తామా వంద గమనికలు. మీ పిల్లలు తినే కిట్‌కాట్‌లో పంది కొవ్వు వుంది. చిక్‌లెట్‌లో ఖడ్గమృగం పాలున్నాయి. పాలపొడిలో ఫలానా విషపదార్థం వుంది. ఎమ్‌సెట్ ర్యాంకులు నారాయణా, శ్రీ చైతన్యావాళ్ళు చెప్పినట్లు E 100, E 111, E 112, E 114 అంటూ ఓ వంద కోడ్‌లిచ్చి "మీరు ఏ వస్తువు కొంటున్నా ఇవి చూసుకుని చావండి" అంటారు.

అసలు ఏదో ఓ రోజు అందరం చావాల్సిందే అంతదాకా ఇలా ఏది నోట్లో వేసుకుని నమలాలన్నా, తాగాలన్నా చూసుకుని చస్తూ బతకడం అవసరమా?

"మేగీలో విషపదార్థాలున్నాయి", "కోక్‌లో టాయిలెట్ క్లీనర్లున్నాయి", "అమితాబ్‌బచ్చన్‌కి 'కోక్ పెప్సీ' ఏడ్స్ ఇవ్వడం వల్ల పెద్ద పేగు తీసేసారు. "

"విక్స్ వేపరబ్ స్లోపాయిజన్", "లైఫ్‌బాయ్ సబ్బువల్ల క్షయ వస్తుంది", "సారిడాన్ వేసుకుని ఒకావిడ కోమాలోకి వెళ్ళిపోయింది" అని జనాన్ని భయపెట్టి చంపెయ్యడానికి వీళ్ళ దగ్గర ఎంత టైముందా? అని ఆలోచించా.

వీళ్ళ దగ్గర టైంతోపాటు స్మార్ట్ ఫోనులుండడం అసలు అత్యంత ప్రమాదకరమై పోయింది.

స్మార్ట్ ఫోన్‌లు చేతిలో వుంటే వాడి చేతిలో ఎ.కె.47 వున్నట్లే. దాంతో తెల్లవారగానే, తన ఫోన్‌బుక్‌లో వున్నవారందరికీ భయంకరమైన మెసేజెస్ పంపగలడు.

నేను నిద్రలేద్దామా వద్దా? నా వల్ల ఈలోకానికి ఏవైనా అవసరం వుందా లేదా? అని ఆలోచిస్తుండగా 'టింగ్'మని మెసేజ్ సౌండ్ వస్తుంది. తీరా వచ్చాకా చూసి చావాలిక! చూస్తాం. 'తల్లితండ్రుల్ని దూషిస్తే దేవుడ్ని దూషించినట్లే వాళ్ళు కళ్ళముందున్న దేవతలు' అని ఎవడో తలమాసిన గంగరాజు పంపిస్తాడు. నేను అదిరిపడి లేచి కూర్చుని నిన్నా మొన్నా లేక అటు మొన్నా మా అమ్మని ఏవైనా అన్నానా? కొంపదీసి ఫ్యామిలీ గ్రూప్‌లో ఏవైనా సెటైర్లు వేసానా, మా అక్కల్లో ఎవరైనా స్ప్రైయింగ్ చేసేసారా ? అని ఆలోచిస్తా. ఓ వేళ మా అమ్మకి అలాంటి అనుమానాలొస్తే చాలా తెలివిగా ఇలా నా మీద అస్త్రాలు ప్రయోగించకలదు.

ఆవిడ అనుకున్న పని ఆరోజే సాధిస్తుంది. నాలా ఇవాళ రాయాల్సిన కాలమ్ ముప్పయ్యో తారీఖు తెల్లవారు ఝామున అందేట్లు కౌముదికి రాయదు.

చంద్రబాబు నాయుడు మెజారిటీతో గెలిచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అవగానే, నన్ను అడిగింది "నేను చంద్రబాబుని కలవాలి పంపించు" అని. నేను వింతగా చూసి "పవన్‌కళ్యాణ్ సినిమాకి ఫస్ట్‌డేన పంపగలను. వీసా తెప్పించి అమెరికా పంపమంటే పంపుతా అంతేకానీ ఇలా చంద్రబాబుని కలుస్తా, మోడీని కలుస్తా అంటే పంపలేను" అన్నాను.




తర్వాత నా పనులు చూసుకుని సిట్టింగ్‌కి వెళ్ళిపోయాను. ఓ గంటకి ఫేస్‌బుక్‌లో అమ్మ మనవడిని అడిగి అప్‌లోడ్ చేయించిన ఫొటోలు చూసి నాకు దిమ్మ తిరిగిపోయింది. చంద్రబాబునాయుడి నెత్తిమీద చెయ్యి పెట్టి ఆశీర్వదిస్తూ ఈవిడా, వినయంగా తల ఒంచి దణ్ణం పెడ్తూ ఆయనా!

గాభరాపడి నేను ఫోన్ చేసి మా అన్నయ్యని అడిగా "ఈవిడ చేసిన పని చూసావా?" అని.

"గుడికని పొద్దుటే వెళ్ళింది" అన్నాడు వాడు.

ఆవిడ గుడినుండి, బాబాకి వేసిన పూలమాల తీసుకుని, అక్షింతలు పొట్లం కట్టుకుని, తిన్నగా తెలుగుదేశం ఆఫీస్‌కి వెళ్ళిందట. అక్కడున్న సెక్యూరిటీ ఆఫీసర్‌కి తన చేతిలో వున్న నేను రాసిన 'లీడర్' పుస్తకం చూపించి, మాది ఫ్రీడమ్ ఫైటర్స్ ఫ్యామిలీ అని చెప్పి, కొన్ని కథలు చెప్పి (మా అమ్మ కదా!) నేను ఆయన్ని దీవించాలి అందిట.

ఆ తరువాత ఆవిడ చెప్పిన ప్రకారం ఈవిడిని సగౌరవంగా తీసుకెళ్ళి, కూర్చోపెట్టి, ఆయన రాగానే చెప్పి ముందుకి పంపించారుట. ఆయన ఒంగి దణ్ణం పెడితే, ఈవిడ అక్షింతలు వేసి, చేతిలో 'లీడర్' పుస్తకం పెట్టి ఫోటో తీయించుకుంది. సందర్భోచితంగా పసుపుచీర కట్టుకుని మరీ వెళ్ళింది. అంత కార్యశీలత ఆవిడది. నాలా బద్ధకం లేదు.



సో.. మా అమ్మ కుట్ర ఏవైనా వుందా? ఈ తల్లితండ్రుల వాట్స్‌ఆప్ మెసేజ్ వెనకాలా అని కొంత తడవు ఆలోచించా! అసలీ మెదడుకి మేతలూ.. పొద్దుటే వేమన్నలు పంపే నీతి సూత్రాలూ మనకి ఎందుకండీ? ఇవన్నీ 'స్మార్ట్‌ఫోన్‌లు' తెస్తున్న తంటాలు.

మొన్న తలకూడా దువ్వుకోకుండా, నీరసంగా పడుకుని, స్మార్ట్‌ఫోన్‌లో కాల్ వస్తే తీసా. ఎదురుగా నా డాక్టర్ మిత్రుడు "జ్వరం అని మెసేజ్ పెట్టావుగా. నాలిక జాపు" అని పరీక్షించి 'ఫేస్‌టైం'లో మందులు రాసిచ్చాడు. ఇలా సడెన్‌గా చూడకుండా ఈ ఫోన్లు నొక్కేస్తే ఎంత ప్రమాదం?

అసలీ ఫోన్స్ వచ్చాక కదూ వీడియో రికార్డింగులూ, రహస్య ఫోటోలూ తీసి అమ్మాయిల్ని ఏడిపిస్తున్నదీ. ఛ. ఎవరి మీదైనా హాయిగా కడుపారగా చాడీలు చెప్దామన్నా, అవతలి వాడు రికార్డ్ చేస్తున్నాడేమోనన్న భయమూ! పాపం సెలెబ్రిటీలకైతే వాళ్ళు ఏదో ఎబ్బెట్టుగా పోజు పెట్టినప్పుడూ దూరం నుండి అడగకుండా ఫోటోలు లాగెయ్యడం ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసెయ్యడం.

ఒకావిడ ఫేస్‌బుక్ నిండా 'నేను ఎన్ని పనులు చేస్తాను తెలుసా? ఎన్ని సాధించానో తెలుసా? ' అని తన వీపు తనే చరుచుకుంటూ, బాజా బజాయిస్తూ టపాలు పెడ్తుంది. ప్రతి పదినిమిషాలకి ఓ టపా పెట్టే ఈవిడ, తను చెప్తున్న 'లిస్ట్' అంతా తనే చేస్తుందా? మనుషులనీ, ఘోస్ట్‌లనీ పెట్టి చేయిస్తుందా అని నాకో డౌట్.. అనుమానం.

అసలు మా చిన్నప్పుడు ఎవళ్ళకీ టైంలు వుండేవి కావు. మా అమ్మమ్మగారు ఆ రోజుల్లో హిందీ ట్యూషన్లు చెప్పేవారు, గాంధీభవన్‌లో నూలు వడికేవారు. లైబ్రేరియన్‌గా పని చేసేవారు. సాయంత్రానికి ఇల్లు చేరి మా పదకొండు మంది మనవలకీ, లాంతరు పెట్టుకుని చదువు చెప్పేవారు. ఆవిడ ముసలి తల్లికి సేవ చేసేవారు. అమ్మ ఆఫీసు నుండి వచ్చేసరికీ రోజూ వంట చేసేవారు. వచ్చేపోయే బంధువుల్ని విసుక్కోకుండా ఎన్ని రోజులైనా అట్టిపెట్టుకునేవారు. ఇల్లు ఇరకటం అయినా మనసులు విశాలంగా వుండేవి. హాల్లో జంబుఖానా పరుచుకుని పిల్లలం వరుసగా పడుకునేవాళ్ళం.

చిన్నప్పుడు మా అక్క ఒకత్తి వున్న నాలుగు మంచాల్లో వచ్చిన అతిధుల్ని సర్దాలన్న తాపత్రయంతో పాపం "నరసాపురం బాబాయ్, అమ్మా ఓ మంచంలో, నేనూ కామత్తయ్య కొడుకూ ఓ మంచంలో, కామత్తయ్యా, నాన్నా ఓ మంచంలో" అని పెద్దాళ్ళ చేత తల వాచేట్లు తిట్లు తింది. ఎందుకు తిట్టారో తెలిసే వయసు కాదది. ఇంక మా రెండో పెద్దనాన్న అయితే "మా ఫ్యామిలీ అంతా ఒక 'కాట్లో' పట్టేస్తాం" అన్నాడట. అందరూ ఘొల్లున నవ్వి "అలా అనకూడదు మంచంలో అనాలి" అని సవరించారు.

ఎవరింటికెళ్ళినా పొద్దుటే ఆ ఇంటి ఆడవాళ్ళు చాలా హడావిడిగా, ఇళ్ళు వూడ్చుకుంటూనో, పొయ్యి దగ్గర కూర్చుని వండుతూనో, కూరలు తరుగుతూనో, పిల్లలకి స్నానాలు చేయిస్తూనో, జడలు వేస్తూనో వుండేవారు. పిల్లల్ని బళ్ళకి పంపడానికి వంట హడావిడి. చద్దన్నాలు పెట్టినా, టిఫిన్ బాక్సులు కట్టాలిగా! ఈలోగా గెడ్డాలు చేసుకుంటున్న మొగుళ్ళకి వేడి నీళ్ళు అందించడం, బాత్‌రూములలోకెళ్ళి 'అంబా' అని అరిస్తే అండర్‌వేర్, బనీన్‌లు అందించడం, వాలుకుర్చీలో కూర్చున్న మావగార్లకి రెండో మాటూ, మూడో మాటూ కాఫీలు అందివ్వడం, అత్తగారికి పూజకి సిద్ధం చెయ్యడం, మహా నైవేద్యాలు పెట్టడం, ఈలోగా పెరట్లోంచి పనిమనిషి "కాస్త చాయ్ పొయ్యమ్మా" అనో "కూసింత చింతపండు వెయ్యమ్మా" అనో అరుస్తుంటే అందిస్తూ, పాలవాడూ, కూరలమ్మాయ్ పిలుస్తుంటే పరిగెత్తుతూ "గోరు చిక్కుడు కాయలు ముదురనీ," "దోసకాయ రుచి చూపించమనీ" "గోంగూర ఇంకో కట్ట ఎక్కువ వెయ్యమనీ" అర్ధరూపాయి తగ్గిస్తేనే కానీ గంప ఎత్తడానికి సాయం చెయ్యమనీ, అష్టావధానాలూ, శతావధానాలూ చేస్తూ, చంటిగాడు అప్పుడే బయలుకి వెళ్ళడం చిన్నది గడప తగిలి బోర్లాపడి ముక్కు చితక్కొట్టుకుని గుక్క పట్టడం, కొడుకు ఆఫీస్‌కి వెళ్ళే వేళ్టికి వాకిట్లో ముగ్గు పెట్టలేదని అత్తగారి సాధింపూ, హోం వర్క్ బుక్‌కి అట్టవెయ్యలేదని అంబుజం టీచర్ కొడ్తుందని పెద్దదాని నసా.. ఇంటర్వెల్‌లో ఐస్ ఫ్రూట్‌కి డబ్బులు ఇమ్మని ఇంకోడి పేంకితనం. పాపం ఇలా వుండేది ఇల్లాలి పరిస్థితి.

రేడియోలో సంస్కృత వార్తలు (అర్ధం అయి చచ్చేట్లు) పెద్దగా పెట్టి, "అమ్మాయ్ అరటికాయకూరలో ఆవ పెడ్తున్నావా? " అనో "ఇలా వచ్చి కాస్త ఈ రేడియో స్టేషన్ మార్చి వెళ్ళు" అనో మావగార్లు పిలుస్తుండేవారు.

అత్తగార్లు "అదేవిటే కాకరకాయలు బండి చక్రాలంత తరిగావ్?", "పచ్చడి పోపుకి అంత నూనె వేసావ్?", "కూర తాళింపూ బట్ట జాడింపులో తెలుస్తుందమ్మా ఇల్లాలి పనితనం" అని సణుగుతుండేవారు. మరి ఏదో ఒకటి చెయ్యకపోతే వాళ్ళకీ తోచదుగా.

ఇలా ఇల్లాళ్ళు కాలుగాలిన పిల్లుల్లా వంట గదికీ మిగతా గదులకీ తిరుగుతూ వాకిట్లోకి అమ్మొచ్చిన వాళ్ళకీ, అడుక్కుతినేవాళ్ళకీ బదులు ఇస్తూ, కాళ్ళకి చక్రాలు కట్టుకున్నట్టు తిరిగేవారు.

పిల్లలు బళ్ళకి వెళ్ళి, మొగుళ్ళు ఆఫీసులకి వెళ్ళాకా, పోనీ ఏవైనా ఖాళీగా వుండేవారా అంటే అదీ లేదు. మధ్యాహ్నాలు అత్తగారు "అమ్మాయ్ నవారు మంచం కుక్కి అయిపోయిందే కాస్త సాయం చెయ్యి" అంటూ నవారు నేస్తూ కూర్చోపెట్టేవాళ్ళు. ఎన్నోసార్లు నా వేళ్ళు అందులో పడి నలిగిపోయాయి. "అష్షూ, ఉష్షూ" అంటే "అదేం సోద్యమే ఆరు మల్లెపూలు ఎత్తులాగా? పుట్టింట్లో ఇవన్నీ నేర్పలేదా?" అనేవారు. లేదా ఉపవాసాలకి ఉప్పుపిండి కోసం తిరగలి ముందేసుకుని బియ్యం విసరాలి. ఏడాదికి ఓసారి కొనుక్కునే పప్పులూ, బియ్యం బాగుచేసుకోవాలి. చివరకి ఆవాలు కూడా పీట మీద వేసి, వాలుగా జారుస్తూ ఇసుక తీసెయ్యాలి. బియ్యం వండేముందు నీళ్ళల్లో గాలించి, అడుక్కి రాళ్ళు తేలేట్లు చెయ్యాలి. అదో ఆర్ట్. బాయిలర్ రాక్షసి బొగ్గు వేసి అంటించడం రావాలి. కుంపటి, ఎక్కువ అగ్గిపుల్లలు

గియ్యకుండా, కాయితాలు వేస్ట్ చెయ్యకుండా వెలిగించటం తెలియాలి. రోట్లో రోకలి పోటేస్తే నాలుగుసార్లకే పచ్చడి నలగాలి. రోట్లో పప్పువేసి, ఓ చేత్తో తోసుకుంటూ ఇంకో చేత్తో రుబ్బాలి. కుంకుడుకాయలైతే తలంటుకోడానికి కొట్టి డబ్బాలకి ఎత్తాలి. 'షికాయ' అయితే 'షి'లు వాడ్తారు కాబట్టి అప్పటికప్పుడే ఉడకబెట్టి, రుబ్బుకోవాలి. చీరలకి గంజిలు పెట్టుకోవాలి. మగాళ్ళ షర్ట్‌లకి వూడిపోయిన గుండీలు కుట్టుకోవాలి. అత్తగారు నడుం వాల్చింది కదా అని కాసేపు గోడమీంచి "వదినా పనయిందా? శోభన్‌బాబు సినిమా వచ్చిందిటగా వెళ్దామా?" అని మాట్లాడుకునేలోపులో ఎవరో చుట్టం దిగేవాడు.

ఊళ్ళో వాళ్ళయితే కాఫీతో పని అయ్యేది. పొరుగూరు నుండి వస్తే, మళ్ళీ స్టౌలో అగ్గేసి, ఏవైనా కూర ముక్కలు వేయించి, అప్పడమూ, వడియమూ, ఊటలోంచి తీసిన ఆవకాయా, పెరుగన్నంలో అరిటిపండూ, కాలాల్ని బట్టి మావిడిపండూ వడ్డించాలి. ఏ టైంలోనైనా చెప్పాపెట్టకుండా వచ్చేవాళ్ళు బంధువులు. చెప్పడానికి సెల్‌ఫోన్లే కాదు మామూలు ఫోన్లు కూడా అందరికీ గగన కుసుమాలే.

పొరుగూరు అయితే ఉత్తరాలు రాసేవారు. పోస్ట్‌మేన్ సైకిల్ గణగణ గంట కోసం నేను కథలు రాసే తొలిరోజుల్లో చకోర పక్షిలా ఎదురుచూసేదాన్ని. ఎంతమంది బంధువుల్ని మనకి తెలీని స్నేహితుల్ని, విషాదాల్ని, వినోదాల్ని బట్ట సంచిలో మోసుకుంటూ ఇంటింటి ముందూ ఆగుతూ సైకిలెక్కి వచ్చేవాడు, మేఘుడికి 'అన్నాయ్'లా పోస్ట్‌మేన్. కానీ టెలిగ్రాఫ్ ఆఫీస్ నుండొస్తే మాత్రం గుండె బేజారు. తప్పకుండా చెడ్డవార్తే అన్నంత భయం. కొన్నిసార్లు పురుళ్ళూ, పుణ్యాలూ, పరీక్ష పాసయిన వార్తలూ, ప్రమోషన్లూ, కథలకి ప్రైజులు రావడం లాంటి శుభవార్తలూ వచ్చేవి.

మధ్యాహ్నాలు పిల్లలకి చిరుతిళ్ళు చేసుకోవడం కూడా వుండేది. ఇలా 'స్విగ్గీ' ఏప్‌లూ, 'డోమినోస్' పిజ్జాలూ ఇంటికొచ్చే రోజులు కావు. అమ్మలు పిల్లల కోసం చేగోడీలూ, జంతికలూ, కారప్పూసా, బూందీ, లడ్డూ, మైసూర్ పాకం చేసి డబ్బాల్లో దాచేవారు.

"తాయిలం పెడ్తాను రండి" అని అమ్మమ్మ వేయించిన వేరుశనగపప్పో, ఉప్పూ కారం కలిపిన మరమరాలో, అటుకుల చుడువానో పెట్టేది.

ఇంక కాలంతో పాటు పనులని, ఎండాకాలం అంతా ఊరగాయలు పనులు, వరుగులు చేసి పోసుకోవడం, వడియాలూ అప్పడాలు పెట్టుకోవడం, చల్లమిరపకాయలు మజ్జిగలో వేసుకోవడం. ఏ కాలంలో ఆ ఊరగాయలు ఉసిరికాయా, చింతకాయా, గోంగూరా, పండుమిరపకాయా, నిమ్మకాయా పెట్టుకుని వుంటే, వానాకాలం ఆదుకునేవి. అకస్మాత్తుగా వచ్చిన బంధువులకి వరుగులు వేయించి, పప్పుచారన్నం పెడ్తే చలికాలం అద్భుతంగా వుండేది. అమ్మమ్మ దొండ వరుగులూ, కాకర వరుగులూ, దోస వరుగులూ అన్నీ చేసేది. మా అత్తగారు ఉల్లిపాయతో మినప్పప్పు రుబ్బి వడియాలు పెట్టేది. అవి వేయిస్తే అచ్చం పకోడీల్లానే వుండేవి. ఇలా ఆడవాళ్ళు 360 రోజులూ బిజీబిజీగ కాలం గడిపేవారు. వీటిల్లో రోగాలు, రొష్టులు, పెళ్ళిళ్ళు, అశుభాలు, అన్నీ వుండేవి. ఎవరి ఇంట్లోనో కష్టం వస్తే "అనసూయక్కకి పెద్దాపరేషనట. ఇంట్లో పిల్లలకి ఇంత వుడకేసి పెట్టాలి" అని రెండు చీరలు సంచిలో పెట్టుకుని వెళ్ళిపోయేవారు. లేదా "ఉభయకుశలోపరి మీ కామేశ్వరొదిన దీవించి వ్రాయునది, మీ మేనకోడలి పెళ్ళి కుదిరింది. జూన్ పదిన పెట్టుకున్నాం. ఓ నెల ముందుగా నువ్వు రావలసినది. ఇట్లు కామేశ్వరి వ్రాలు" అని ఉత్తరం పసుపు పెట్టి వస్తే, ఇంక రెక్కలు కట్టుకుని పెళ్ళిపనులకి వెళ్ళి వాలడమే.

మా అమ్మమ్మ దగ్గర రెండు బూంది చట్రాలు వుండేవి. వంటలక్కలా అవి పట్టుకుని వెళ్ళిపోతుండేది.

ఆడవాళ్ళకి వాళ్ళు వాడే వస్తువులు మీద మమకారం. మనింటికి మాగాయ ముక్కలు తరగడానికొచ్చిన ఎదురింటావిడ, ఆవిడ ఆల్చిప్పలూ (తొక్క తియ్యడానికి అప్పట్లో) కత్తిపీటా తనే తెచ్చుకునేది.

మా ఆడబిడ్డ పైన మా ఇంట్లో వూడవాల్సి వచ్చినా తన చీపురు తెచ్చుకుంటుంది. మా అమ్మ అయితే "నీ పెనం బాలేదు" "నీ అప్పడాల కర్ర బాలేదు", "నీ మిక్సీకి పదునులేదు" అని వంకలు పెడ్తూనే వుంటుంది. మొన్న నేను అమెరికాలో వున్నప్పుడు మా అబ్బాయి క్లాస్‌మేట్ అమ్మా, అమ్మమ్మా కూడా 'కాన్వకేషన్'కి వచ్చారు. వాళ్ళు ఇండియాలో వాళ్ళింటికి చక్రాలు పెట్టి తెచ్చినట్లు, జంతికల గొట్టం,

కజ్జికాయ పీటా, కవ్వం, అప్పడాల కర్రా అన్నీ తెచ్చుకున్నారు. ఉన్నన్నాళ్ళూ పిండి వంటలు చేసి నాకు పంపించి, వాళ్ళు తింటూనే వున్నారు. జంతికల పిండిలో పెరుగు కలిపి చెయ్యడం వాళ్ళ దగ్గరే చూసాను.

"కిచెన్‌ల అన్నీ బర్నపురుగులు. వుడదు.. వుడదే వుడదు" అని మాట్లాడేవారు. బర్నపురుగులు అంటే బొద్దింకలు, 'వుడదు' అంటే 'వుండనివ్వవు' అనీ నాకు తర్వాత అర్థమైది.

మా వాడు వాళ్ళతో 'డంబ్ షెల్ ప్లే' అని సినిమా పేర్లు సైగలతో చెప్పే ఆట ఆడదాం అంటాడు. వాళ్ళ భాషే అర్థం కాదు. నేనేం సైగలు చెయ్యాలి?

అన్నింటినీ 'ఎత్తుకుపో' 'ఎత్తుకుపో', అది 'తిని పూడ్సు' ఇది 'చేసి పూడ్సు' అనేవారు. 'అన్నీ పూడ్చాం' సరే, "చెన్నై వస్తే మీకు పట్టుకోక ఎత్తిపిస్తం చెన్నై మాల్‌లో" అన్నారు. అది మాత్రం బాగోలేదు. ఏమైనా వాళ్ళని ఎవరైనా "మీరు తమిళయన్నా?" అంటే వాళ్ళు భరించే వాళ్ళుకాదు " మేముదా తెలుంగు" అనేవాళ్ళు. చాలా ఏళ్ళుగా తమిళనాట స్థిరపడిన తెలుగువాళ్ళు, వాళ్ళు.

మనం మాట్లాడ్తున్నది ఆడవాళ్ళ పనిపాటల గురించికదూ. ఇంక ఆదివారాలొస్తే, ఇంటి మగాళ్ళకీ, పిల్లలకీ శలవుకానీ ఆడవాళ్ళకి ఓవర్ టైం వర్క్. పిల్లలకి తలంట్లు జుట్లు వుంటే నెత్తిన మొగుళ్ళకీ తలంట్లు. ఆదివారాలు తప్పకుండా వచ్చే బంధువులు. అలవాటుగా మధ్యాహ్నాలొచ్చే మిత్రులు. టీ.వీలు లేని కాలంలో చతుర్ముఖపారాయణాలు. రోజంతా వంటింట్లో టీలు, ఎక్కే కాఫీ డికాషన్‌లు, దిగే ఉప్మా బాండీలు, పళ్ళేల్లో కారప్పూసలు. పిల్లకాయలకి పల్లీపట్టీలు, మరమరాల వుండలూ. పనిమనిషి ఆదివారాలు డుమ్మా కొట్టడం సర్వసాధారణం. ఆడవాళ్ళకి చాకిరేవు పెట్టడం అదో రకం ఆనందం. మేం చిన్నపిల్లలుగా వున్నప్పటినుండీ పని చేసేవాళ్ళం. ఆదివారాలు రిబ్బన్లు ఉతుక్కోడం, కాన్వాస్ షూలు సుద్దరాసి ఎండపెట్టడం, మగపిల్లలు చొక్కాలూ, ప్యాంట్లూ చెంబు ఇస్త్రీలు చేసుకోవడం, మేం సీజన్‌ని బట్టి దోమ తెరలు ఉతుక్కోవడం, కలరా వుండలేసి బీరువాలో దాచుకోవడం. కమ్మని వాసన వేసే చాకింటి నుండొచ్చిన తెల్లని పక్కల మీద, మా అమ్మలు తలగడల మీద మధ్యాహ్నాలు కుట్టిన లతల మీద తలలు పెట్టి చల్లగా విశ్రమించడం.

కాళీయ మర్దనాలు, లక్ష్మీదేవిలూ అల్లిన తెరలు గుమ్మాలకి వేసి, పండగలొస్తే ఇల్లంతా పిండి ముగ్గులు పెట్టి మురిసిపోవడం.

చెక్క మంచాల్లో చేరిన నల్లుల్ని వేడినీళ్ళు మరిగించి పోసి చంపడం, దోమలొస్తే వేపాకు పొగవేసి తోలడం, వంట గది కడిగాక, రాత్రుళ్ళు ఎలుకల బోన్‌లో ఉల్లిపాయ పకోడీ వేసి ఎలకల్ని పట్టడం పిల్లులు పాలు తాగెయ్యకుండా వంట గదుల్లో ఉట్లు వేలాడదీసుకోడం కాకులు వడియాలు తినకుండా, నల్లగుడ్డ కానీ నల్లగొడుగు కానీ పక్కన పెట్టడం.

వానాకాలం వస్తే గొడుగులు బాగుచేయించుకోవడం, ఎండాకాలం వస్తే ఇంటి ముందు పందిరి వేసి, వట్టివేళ్ళ తడికలు కట్టుకోవడం. గిన్నెలు సొట్టలు పడ్తే, ' మాట్లేస్తాం. గిన్నెలకి మాట్లేస్తాం' అని పాడ్తూ వచ్చేవాళ్ళని పిలిచి మాట్లేయించడం. 'కత్తికి పదును చురకత్తికి పదునూ' అని సైకిల్ మీదొచ్చి చక్రం నిప్పులు చిమ్ముతూ గిరగిర తిరుగుతుంటే కత్తులకి పదును పెట్టించుకోవడం, పాముల్ని ఆడించేవాళ్ళు వస్తే, కాసిని బియ్యం వెయ్యడం, కోతుల్ని ఆడిస్తుంటే, పావలా డబ్బులు వెయ్యడం. అన్నాలు తిన్నాక 'అమ్మా.. అన్నం వెయ్యి తల్లీ' అని వచ్చే బిచ్చగాళ్ళ కోసం కాస్త అన్నం, పులుసూ మిగిల్చి వుంచడం. అప్పుడప్పుడూ లగ్జరీగా 'సోడాయ్' అని వచ్చే సోడా వాళ్ళని పిలిచి 'కలర్‌సోడా' తాగడం పిల్లల్ని చూస్తే కదలని పీచు మిఠాయి వాళ్ళనీ, ఐస్ ఫ్రూట్ వాళ్ళనీ బేరాలు చేసి పిల్లలకి కొని పెట్టడం. వేసంకాలం చెరుకు రసాలూ, తాటిముంజెలూ, మల్లెపూలూ, మావిడి పండ్లూ, రాత్రిళ్ళు ఆరుబయట డాబామీద పక్కలూ, పక్కనున్న మరచెంబులు నిద్రలో తన్ని పక్కలు తడుపుకోడాలూ, గుమ్మంలో వేపగాలీ, రాలిపడే ముత్యాల్లా పక్కల మీద వేపపూతా!

అర్థరాత్రుళ్ళు ఏడిపించడానికి ఒక జల్లుపడి, పక్కలు చుట్టుకుని పరిగెత్తేట్లు చేసే వానా.

ఆ రోజుల్లోకి వెళితే ప్రతీ పనిలో ఆనందమే. అసలు ఆడా, మగా, చిన్నా చితకా అంతా పనులు చేసేవారు. ఈ రోజుల్లోలాగా 'ఫేస్‌బుక్ గోడల మీద పిడకలు చరుచుకోవడం కాదు' మళ్ళీ మేం బహుముఖ ప్రజ్ఞాశాలులం. బోలెడు పనులు చేస్తాం అని రాసుకోవడం. ఐదు నిమిషాలకో పిడక చరచడం.

మా 'లార్డ్' (మా ఆయన) ఈ మధ్య ఆదివారాలు ఆఫీసు లేనప్పుడు కూడా తోట పనుల్లో బిజీగా వుంటున్నారు. మా జీవ్స్ (కుమార్‌ని) బిజీగా పెడ్తున్నారు.

మళ్ళీ ఇంటికి అమెజాన్‌లో 'కోకోపీట్', 'వర్మీ కంపోజ్‌డ్' లాంటి ఎరువులూ, డ్రిల్లర్ మున్నగు గార్డెనింగ్ టూల్స్ ఇంటికి వస్తున్నాయి. లాస్ట్‌వీక్ "ఒరేయ్ కుమార్ వెనక వీధిలో రామచంద్రరావుగారి ఇంటి ముందు ఓ ట్రీ గార్డ్ ఖాళీగా వుంది ఎత్తుకురారా" అన్నారు.

"సార్ చూస్తే తంతాడు" అన్నాడు కుమార్.

"అందుకే నిన్ను వెళ్ళమన్నా. రాత్రికి వెళ్ళు" అన్నారు.

"ఒంటికి నూనె రాసుకుని, మొహానికి నల్లరంగు పూసుకునా?" నేను అడిగాను.

నన్ను లెక్క చెయ్యలేదు మా లార్డ్.


"ఒరేయ్ గార్డెనింగ్ అంటే కష్టం నష్టం వుంటాయిరా వెళ్ళి తీసుకురా" అన్నారు.

సరే తెచ్చి అందులో ఓ కానుక చెట్టు వేసారు. తెచ్చిన ఎరువుల్లో ఏవీ వాడలేదు. అవి మట్టిలో కలిపి నానబెట్టి బెండా, దోసా, టమాటా విత్తనాలు వెయ్యమంటే, మా వరలక్ష్మి మొగుడు శీను వచ్చి "అక్కర్లేదండీ ఆయ్" అని వాడిష్టం వచ్చినట్లు వేసేసాడుట. మా ఆయన గంటన్నర సేపు చూసిన యూ ట్యూబ్ వీడియో, అమెజాన్ కోకోపీట్ వర్మీ కాంపోజ్ అన్నీ వేస్ట్ అయ్యాయి. ఈయన చిన్న బోయిన మొహంతో లోపలికొచ్చి "దే ఆర్ నాట్ ఫాలొయింగ్ మై ఇన్‌స్ట్రక్షన్స్" అన్నారు.

నేను వెళ్ళి చూసేసరికి, మా అమ్మా, ఆడబిడ్డా నడ్డిన చేతులు పెట్టుకుని ఇచ్చే ఇన్‌స్ట్రక్షన్నే మా కుమారూ, శీనూ, వరాలూ ఫాలో అవుతున్నారు.

గిన్నెలు తోముతున్న రమ "కుండీల్లో అయ్య ధనియాలు, మెంతులూ వేసాడు. ఇంక మీరు కూరగాయలు కొనక్కర్లేదమ్మా" అని కిసుకూ కిసుకూ నవ్వుతోంది. అది తోమే గిన్నెల్లా బుగ్గలు సొట్టలుపడ్తూ.

నాకు మాత్రం ఆదివారాలు కూడా పని చేసే (చేయించే) మా లార్డ్‌ని చూస్తే ముచ్చటేసిందిస్మా!




COMMENTS

